# చెక్క భజన

భగవంతుని పై భక్తునికిగల భక్తిని తెలియచేయు మార్గాలలో ఒకటి "భజన". చెక్కలతో చేయు భజనను చెక్కభజన అందురు. రెండు చెక్కలకు చివరలో ఏర్పాటు చేయబడిన లోహపు ముక్కలు భజన చేసేటపుడు మంచి శబ్దంకలుగ చేస్తుంది. కోలాటంలోవలె భజనబృందం పాటపాడుతూ నృత్యం చేస్తారు. భజన బృందాన్ని "జట్టు" అని అందురు. ఆంధ్రప్రాంతంలో చెక్కభజన ఎంతో ప్రసిద్ధి కాంచింది. ముఖ్యంగా శ్రీరాముల వారి దేవస్థానాల్లో ఈ భజనకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీరామ మందిరం లేని గ్రామం ఉండదు, ఆ రామ మందిరమున్నచోట చెక్కభజన తప్పకచేస్తారు. పొలం పనులు అయిపోయిన తర్వాత అనగా వేసవికాలంలో ఈ భజనను నేర్చుకొంటారు.



పూర్వపు రోజులలో అనగా ప్రతి గ్రామంలో చెక్కభజన బృందాలున్న రోజులలో ఒక గ్రామంలోని భజనబృందం ఇంకొక గ్రామానికి భజనచేస్తూ జ్యోతిని తీసికొనివెళ్ళి గ్రామంలోని ముఖ్యప్రదేశంలో భజనచేసి ఆ గ్రామం యొక్క భజన బృందానికి ఆ జ్యోతిని అందచేసేడివారు. ఆ విధంగా ఆ జ్యోతి ఒక గ్రామంనుండి వేరొక గ్రామానికి భజనచేస్తూ తీసికొని వెళ్ళుచుండేవారు. ఈ విధంగా శ్రీరామనవమి వరకు తీసికొని వెళ్ళి, చివరి గ్రామం వారు శ్రీరామనవమి రోజున ఆ జ్యోతిని ప్రసిద్ధిగాంచిన భద్రాచల క్షేత్రంలో శ్రీరాముల వారి గుడిలోకి అందచేసెవారు. భజన ప్రారంభించిన మొదటి గ్రామంలో శ్రీరామ జననం మొదలుపెట్టి భద్రాచలం చేరునాటికి శ్రీరామ పట్టాభిషేకంతో పూర్తిచేస్తారు.

వృత్తాకారంలో భజనచేయుచున్న బృందం మధ్య గురువు నిలబడి పాటపాడుతూ సూచనలిస్తాండును. ఆయన మొదట ఒక పాటలో ఒక చరణం పాడగా బృందంలోని

అందరూ ఆ చరణాన్నే భజనచేస్తూ పాటకు తగ్గ అడుగులు వేస్తూ అందుకొంటారు. పాట ఎత్తుగడ మరియు ఆ పాట లయవేయవలసిన అడుగులను గురువు నిర్దేశిస్తాడు. ప్రతిపాట ముందుగా మెల్లగా మొదలుపెట్టి కొద్ది కొద్దిగా వేగం పెంచుచూ ముగియునపుడు పాట, భజన, నృత్యం వాద్యాల వేగం పెంచి చివరకు పాట పూర్తిచేయబడుతాయి. గురువు ప్రక్కన ఫ్లూటు, మృదంగ వాద్యకారులు ఉంటారు. మధ్యలో భజనపూర్తిఅగువరకు దీపస్తంభంలో ఉంచబడిన జ్యోతి ప్రజ్వరిల్లుచుండును.

చక్కభజన బృందంలో 16 నుండి 20 మంది కళాకారులు ఉంటారు. వీరి వేషధారణ ధోవతి, మెడలో దండ, చేతులకు దండ, తలకు ఎర్రరిబ్బను చుట్టుకొందురు. ప్రతి కళాకారుడు తన చెక్కలను తానే భక్తితో తయారుచేసుకొంటాడు. చెక్కకు బయట శ్రీరామ, సీత, శ్రీలక్ష్మణస్వామి వారి రూపాలు చెక్కబడివుంటాయి. సాధారణంగా చెక్కభజనలోని పాటలన్నీ శ్రీరామునిపై వ్రాయబడిన శ్రీ భక్తరామదాసు, శ్రీ త్యాగరాజు, శ్రీ తూము నరసింహదాసు కీర్తనలు. ఇవిగాక కృష్ణునిపైన ఇతర దేవుళ్లపైన పాటలుకూడా ఉండును.

ఈ చెక్కభజనలు గ్రామాలలో తమదైన బాణిలో ఒక ప్రత్యేకతను సంతరించుకొని గ్రామస్థులను అలరిస్తాయి. భక్తిభావంతోపాటు, సంగీతం మరియు పాటకు తగ్గట్టుగా అడుగులువేస్తూ వివిధ రకాలైన నృత్య భంగిమలతో ఒక జీవకళగా పండిత పామరులనందరినీ ఆకట్టుకొంటాయి.